ప్రజలతో మమేకమైతేనే గుర్తింపు: డీసీపీ



చిత్రంలో ట్రైనీ ఎస్సైలు, కానిస్టేబుళ్లు

కుత్బుల్లాపూర్: ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగిన ఉద్యోగులకే గుర్తింపు లభిస్తుందని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. జోన్ పరిధిలో కొత్తగా నియామకమైన ఎస్సైలు, కానిస్టేబుళ్లతో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని, ఓపిక చాలా ముఖ్యమని, సమస్యలను అధిగమించే దిశగా పని చేస్తే తప్పకుండా పోలీస్ శాఖలో వారి ప్రతిభకు గుర్తింపు ఉంటుందని అన్నారు. సమావేశంలో పెట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

హౌసింగ్ బోర్డు స్థల పరిరక్షణకు చర్యలు

రంగారెడ్డినగర్: తెలంగాణ హౌసింగ్ బోర్డు స్థలాన్ని పరిరక్షించేందుకు అధికారులు చర్యలకు ఉప క్రమించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయాన్ని ఆనుకుని హౌసింగ్ బోర్డుకు చెందిన 4.5 ఎకరాల స్థలం ఉంది. అయితే గత కొన్నేళ్లుగా సదరు స్థలంలో కొందరువ్యక్తులు ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌లు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను జేబుల్లో వేసుకున్నారు. ఈ విషయమై పలుమార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన హౌసింగ్ బోర్డు అధికారులు స్థలం చుట్టూ కందకాలు తవ్వించి బస్సులు నిలపకుండా చర్యలు చేపట్టారు. తాజాగా శాశ్వత ప్రాతిపదికన పరిరక్షించేందుకు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నారు. ప్రహరీ నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. దీంతో బస్సుల అక్రమ పార్కింగ్‌కు చెక్ పడింది.



ఏపీహెచ్‌బీ కాలనీలోని టీఎస్‌హెచ్‌బీ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ

విద్యార్థులకు ఫ్యూయల్ ల్యాబ్ వీడియో క్లాసులు



ఫ్యూయల్ ల్యాబ్ వీడియో క్లబ్ సభ్యులుగా బ్యాడ్జీలందుకున్న బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చింతల్, వెంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో గురువారం పాఠశాల చైర్మన్ టీవీఆర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఫ్యూయల్ ల్యాబ్ వీడియో క్లాసులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఫ్యూయల్ ల్యాబ్ ఇంప్లిమెంటేషన్ మేనేజర్ సారా సుశాన్ ఆ పాఠశాల విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి కొంత మందిని ఫ్యూయల్ ల్యాబ్ వీడియో క్లబ్ సభ్యులుగా ఎంపిక చేశారు. డైరెక్టర్‌గా లక్ష్మీవాసవి, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రతీష్, కెమెరా ఆపరేటర్లుగా నవ్య, గౌతమ్, వీడియో ఎడిటర్స్‌గా సాత్విక, నితిన్, యాంకర్స్‌గా హేమ, లేఖన, యోగ్య, తనూజ్ , స్క్రిప్ట్ రైటర్లుగా వర్షిత, బాలు, ఓవరాల్ మేనేజర్లుగా చంద్రిక, జస్వీర్ ఎంపికయ్యారు. వీరికి పాఠశాల చైర్మన్ శ్రీ కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ మధుబాల, ఫ్యూయల్ ల్యాబ్ ఇన్‌చార్జి రోజారాణి బ్యాడ్జీలు అందచేశారు.

భూపతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

స్పష్టం చేసిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు

దుండిగల్: టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. గురువారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. భూపతిరెడ్డి విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం పనిచేస్తూ నేటికీ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ నేత లకబ్జాలపై ప్రశ్నించిన భూపతిరెడ్డికి సమాధానం చెప్పకుండా చెంచాలతో అసత్యాలు మాట్లాడించిన ఎమ్మెల్యే వివేకానంద్ బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ హయాంలో దాదాపు 1,200 ఎకరాల ప్రభుత్వభూమిని స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ అనుచరులతో కబ్జా చేయించారని అన్నారు. ఒక సినీహీరో ఆస్తిని అనుభవిస్తున్నామని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారని, భూపతిరెడ్డి సదరు సినీహీరో స్నేహితుడి దగ్గరి నుంచి భూమిని కొనుగోలు చేశారే తప్ప ఎవరిని కూడా మోసం చేయలేదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఏ- బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు సదానందం ముదిరాజ్, జిల్లా ఫిషర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ ముదిరాజ్, మైనారిటీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సమీర్ ఖాన్, రాష్ట్ర ఓబీసీ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందని 'అపరెల్ పార్క్' ఫలాలు

- నెరవేరని అపరెల్ పార్క్ లక్ష్యం
- గత ప్రభుత్వాలు పట్టించుకోని వైనం
- అన్నీ వసతులు ఉన్నా మూత పడుతున్న పరిశ్రమలు
- పార్క్‌పై దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు



గుండ్లపోచంపల్లిలోని అపరెల్ పార్క్

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ పేద ప్రజల ఉపాధి కోసం నాటి ప్రభుత్వం మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన 'అపరెల్ పార్క్' లక్ష్యం నెరవేరక అబాసుపాలవుతోంది. నియోజక వర్గంలోని పేద మహిళలకు కుట్టుపని ద్వారా ఉపాధి కల్పించడానికి దివంగత సీఎం నందమూరి తారక రామారావు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. 1995 జులై 19న మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లిలో అపరెల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. 1999 జూన్ 30న నాటి సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్క్‌కు ప్రారంభోత్సవం చేశారు. ప్రధానంగా అపరెల్ పార్క్‌లో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిబంధనలు పెట్టారు. వస్త్ర పరిశ్రమ ఎక్కువగా కర్ణాటకలో ఉండటంతో అక్కడి వ్యాపారులను అపరెల్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా పార్క్‌ను రూపొందించారు. గ్రామానికి చెందిన రైతుల నుంచి 157 ఎకరాల భూమిని సేకరించి మొత్తం 226.36 ఎకరాలలో అపరెల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 129.87 ఎకరాలలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా 121 ప్లాట్లను రూపొందించారు. మిగతా 60 ఎకరాలను మరిన్ని పరిశ్రమల కోసం ఖాళీగా వదిలారు. 38 ఎకరాల పార్క్‌లో రోడ్లు, మురికి కాలువలు, ఇతర వసతులతో పాటు కరంట్ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా పార్క్ కోసం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేశారు. ఇలా అన్నీ వసతులు ఏర్పాటు చేసినా పార్క్ ద్వారా 30 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నాటి ప్రారంభోత్సవంలో గొప్పలు చెప్పారు.

అన్ని వసతులు ఉన్నా పార్క్‌కు రాని పరిశ్రమలు..

పార్క్‌లో సకల సౌకర్యాలు కల్పించినా పాలకులు పరిశ్రమలను రప్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు. అపరెల్ పార్క్‌లో 121 పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నా.. పాలకుల ప్రోత్సాహం లేక పారిశ్రామిక వేత్తలు పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఉత్సాహం కనబర్చడం లేదు. అధికారులు మాత్రం తమ రికార్డుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్లాట్లను కేటాయించినట్లు చెబుతున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్లాట్లు కేటాయించినా పారిశ్రామిక వేత్తల పరిశ్రమల ఏర్పాటు కాగితాల పైనే కనిపిస్తున్నాయి.

అడుగులు పడినా..

గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడినా ఆతర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో అపరెల్ పార్క్ లక్ష్యం మాత్రం నేరవేరలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రత్యేకంగా మరింత స్థలం కేటాయించి పరిశ్రమల కోసం శంకుస్థాపనలు చేసినా ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలకులు పట్టించుకోకపోవడంతో అపరెల్ పార్క్ పెద్దగా అభివృద్ధి చెందలేదు. నూతన ప్రభుత్వం అపరెల్ పార్క్ పై దృష్టి పెడితే మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వెంటనే అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

మూతపడుతున్న పరిశ్రమలు..

అపరెల్ పార్క్ ఏర్పడినప్పటి నుంచి నెలకొన్న ప్రముఖ బ్రాండ్ల వస్త్ర కంపెనీలు క్రమేపీ మూతపడుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందకపోవడంతో వ్యాపారవేత్తలు కంపెనీలను మూసి వేస్తున్నారు. ఎంతోమంది మహిళలకు ఉపాధి కేంద్రంగా నిలిచిన అపరెల్ పార్క్‌పై పాలకులు దృష్టి సారించాలని మేడ్చల్ ప్రజలు కోరుతున్నారు.



అపరెల్ పార్క్‌లో మూతపడ్డ ప్రముఖ వస్త్ర కంపెనీ

నాసిరకంగా డ్రైనేజీ పనులు

చోద్యం చూస్తున్న అధికారులు

నిజాంపేట్: అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా పనుల్లో నాణ్యత లోపించింది. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ బొడ్రాయి, పాత పంచాయతీ కార్యాలయం నుంచి కోటి రూపాయలతో భూగర్భ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. అయితే పనుల్లో కాంట్రాక్టర్ ఇసుకకు బదులుగా రాతిపొడిని వాడుతున్నాడు. మ్యాన్ హోల్ కుండీలకు సైతం సిమెంట్ ప్లాస్టరింగ్ చేసి చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. దీంతో వాటి మన్నికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, గతంలో చేపట్టిన డ్రెయిన్ నాలా పనులను కూడా కాంట్రాక్టర్ ఇదేవిధంగా నాసిరకంగా చేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనులపై దృష్టి సారించి నాణ్యతాప్రమాణాలు పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నిజాంపేట్‌లో నాసిరకంగా కొనసాగుతున్న డ్రైనేజీ లైన్ పనులు



డ్రైనేజీ పనుల్లో వినియోగిస్తున్న రాతి పొడర్



డ్రైనేజీ మ్యాన్‌హోల్ లోపలి భాగంగా ప్లాస్టరింగ్ చేయని దృశ్యం

లోకనాథ్‌రెడ్డి మృతి



లోకనాథరెడ్డి (ఫైల్)

చింతల్: హెచ్ఎంటీ యూనియన్ మాజీ అధ్యక్షుడు, చింతల్ ప్రాంతవాసులకు సుపరిచితుడైన టి.లోకనాథ్ రెడ్డి గురువారం మృతి చెందారు. స్థానికంగా దేవాలయాలు, కాలనీల అభివృద్ధికి లోకనాథ్‌రెడ్డి కృషి చేశారు. ఆయన మృతి సమాచారం అందుకున్న పలు పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు.

ముగిసిన నర్సింగ్ సొసైటీ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని యశోద ఆసుపత్రిలో ఇన్‌ఫ్యూజన్ నర్సింగ్ సొసైటీ (ఐఎన్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న 12వ వార్షిక సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఫ్యూజన్ థెరపీ, నర్సింగ్‌కేర్‌కు సంబంధించి వైద్యపరంగా వస్తున్న అత్యాధునిక టెక్నిక్స్, ఆవిష్కరణలపై చర్చలు, క్విజ్‌లు, వర్క్‌షాప్స్, ఉపన్యాసాలు జరిగాయి. ఈ సదస్సులో యశోద ఆసుపత్రి డైరెక్టర్ డా.పవన్ గోరుకంటి, వైద్య నిపుణులు డా.దిలీప్‌కుమార్, ఐఎన్ఎస్ ఇండియా అధ్యక్షులు డా.బినూశర్మ తదితర వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్న ఈ సదస్సులో దాదాపు 1200కి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

గ్రంథాలయాలను ఆధునీకరిస్తాం: బొంగునూరి

దుండిగల్: గ్రంథాలయాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, వాటిని ఆధునీకరిస్తామని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కీసర, శామీర్‌పేట్, దేవరయంజాల్, ఆలియాబాద్ శాఖల గ్రంథాలయాలను సందర్శించారు. దేవరయంజాల్‌లో నూతనంగా చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణపనులను పర్యవేక్షించారు. శామీర్‌పేట్ గ్రంథాలయ భవన మరమ్మతులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ మేడ్చల్ కార్యదర్శి సురేష్‌బాబు, కీసర, శామీర్‌పేట్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



శామీర్‌పేట్ గ్రంథాలయ భవనాన్ని సందర్శించిన బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన



వివేకానంద్‌నగర్‌లో ప్రజాపాలన సంబరాల్లో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

చింతల్: ప్రజాసంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ప్రజాపాలన సంబరాల్లో భాగంగా గురువారం చింతల్ డివిజన్ వివేకానంద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల హామీలను సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారన్నారు. అనంతరం రంగానగర్‌లో ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పండరి, నాయకులు జేమ్స్, శ్రీనివాస్‌రెడ్డి , శ్రీనాథ్, బాల్‌రెడ్డి, మధు , ప్రేమ్, నాగరాజు, పృథ్వీ, లలిత, లక్ష్మీ , నాగమణి, కమల తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన సదస్సు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి శ్రీరామ్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం ప్రజాపాలన సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేడ్చల్ సీడీపీవో శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పిల్లల పోషకాహారాలపై పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభా రాణి, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శారద

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



సీపీఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణనాయక్

నిజాంపేట్: సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కేపీహెచ్‌బీ కాలనీ రమ్య సెంటర్‌లో కూకట్‌పల్లి మండల నాయకుడు కృష్ణనాయక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీల్లో ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్ హాలులో జరిగే మహాసభలకు సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాసమస్యపై పార్టీ భవిష్యత్తులో నిర్వహించబోయే పోరాటాలపై చర్చిస్తారన్నారు. మహాసభలకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, చిరంజీవి, కృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

బన్సీలాల్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇరువురిని గాంధీ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి భారీ ఎత్తున బియ్యం, ఆటోను పోలీసులు సీజ్ చేశారు. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం... ముషీరాబాద్ బోలక్‌పూర్, ఫిష్ మార్కెట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సలావుద్దీన్(29), మహ్మద్ పాష(30)లను రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు వివిధ రేషన్‌షాపు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులు ఆటోలో బన్సీలాల్‌పేట్ ప్రాంతం నుంచి వెళ్తుండగా అనుమానం వచ్చి పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. దీంతో రేషన్ బియ్యం దందా గుట్టురట్టైయింది. నిందితుల నుంచి 1,360 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శుభాకాంక్షలు



యూత్ కాంగ్రెస్ నాయకులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్: యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నాయకులకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నల్ల అరుణ్‌కుమార్ గౌడ్, 125 డివిజన్ గాజులరామారం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన షేక్ సల్మాన్ గురువారం శ్రీశైలంగౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కూన రాఘవేంద్రగౌడ్, బిల్లా వెంకట్, వేణు చింటూ, కార్తీక్, అవినాష్ మాథ్యూస్, భాను, మహేష్, జ్ఞానేశ్వర్, అభిలాష్ బంటి, చింటూ, షేక్ అహ్మద్, సయ్యద్ అక్బర్,లాల్ మహ్మద్, షేక్ మోహిన్, చాంద్ పాషా,అహ్మద్,ఇస్మాయిల్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న రామస్వామి కుటుంబ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని మధురనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారు. గురువారం మధురానగర్ కాలనీకి చెందిన రామస్వామి కుటుంబసభ్యులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో దాతలు పాలుపంచుకోవాలని, వస్తు, ధన రూపేణా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రావు, లింగయ్య,హేమంత్ రావు, రామలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి



ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని విక్రమ్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ మాణిక్ రెడ్డి అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులోని షిరిడీ సాయి బాబా ఆలయ 11వ వార్షికోత్సవాన్ని రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ముగింపు సందర్భంగా సర్వాభిషేకం, అర్చనలు, మధ్యాహ్న హారతిని విక్రమ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహా అన్నదానం, పల్లకీ సేవ, పవళింపు సేవతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు శాలిని, గౌరీ, గోవర్ధన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి జీఏకే కృష్ణ, హేమావతి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

సనత్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకంగా మారిందని నార్త్‌జోన్ డీసీపీ రష్మిపెరుమాళ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచిన సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవం'లో భాగంగా బేగంపేట మోతీలాల్‌నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల్లో ఏర్పాటుచేసిన 27 సీసీ కెమెరాలను గురువారం డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయనడంలో సందేహం లేదన్నారు. అత్యంత క్లిష్టమైన కేసులను కూడా సీసీ కెమెరాల ఆధారంగా నేడు చేధించగలుగుతున్నామన్నారు. మోతీలాల్‌నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల అసోసియేషన్లు ముందుకువచ్చి శాంతిభద్రత పరిరక్షణలో తమవంతు భాగస్వామ్యం అందిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావడం శుభపరిణామం అన్నారు. వీరి స్ఫూర్తితో మరిన్ని కాలనీలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ కో-ఆర్డినేటర్, సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సూదం మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో ప్రజల భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు ఒక గొప్ప కార్యక్రమంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్ఐ శ్రీధర్, కాలనీ అధ్యక్షులు రవీంద్ర, జయశ్రీ, చంద్రశేఖర్, శ్రీశైలం, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

మియాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శివర్గ సభ్యులు అంగడి పుష్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి సంవత్సరం అవుతున్నా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శివర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్, కమిటీ సభ్యులు నారాయణ, పార్టీ సభ్యులు ఇషాక్ తదితరులున్నారు.



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు